క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ టి.విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎంఆర్‌ఓ కార్యాలయం, చాకలి దబ్బా ఎల్‌ఐజీ, మహారాష్ట్ర బ్యాంకు, ధనలక్ష్మీ సెంటర్, మంజీరా మాల్ నుంచి జేఎన్‌టీయూ గేటు, రెమెడీ ఆసుపత్రి, రెయిన్ ట్రీ హాస్పిటల్, బజాజ్ షోరూం, ఎస్ఎస్ టు ఈ సేవా, వాటర్ ట్యాంక్‌లు, శ్యామ్ ముఖర్జీ పార్కు, చౌదరి మెస్, చారి డీటీఆర్, ఎంఐజీ 480, సౌజన్య డీటీఆర్, ఎంఐజీ 295, 366, సుబ్బయ్య హోటల్, మమతా ఆసుపత్రి, మధుసూధన్ హాస్పిటల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ధర్మారెడ్డి పార్కు రౌండ్, ఐసీఐసీఐ బ్యాంక్, పూజా ఎలక్ట్రికల్స్ షాపు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, పద్మావతి నగర్, న్యూ రామారావు నగర్‌లలో పలు అభివృద్ధి పనులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగంలో శంకుస్థాపన చేయనున్నట్లు డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ తిమ్మారెడ్డి వీరారెడ్డిలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, అనుబంధ కమిటీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కూకట్‌పల్లి: బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ కమ్యూనిటీ హాలులో మన అసోసియేషన్ ఆధ్వర్యంలో మమత హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కూల్ ఎవరెస్ట్ నిర్వాహకులు యక్కంటీ వెంకటరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, పల్మనాలజీ, ఈఎన్‌టీ, గైనకాలజీతో పాటు బీపి, జీఆర్‌బీయస్, ఈజీజిజ, పీఎఫ్‌టీ, బీఎండీ వంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత వాసులందరు ఈ పరీక్షలను వినియోగించుకోవాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



భాగ్యనగర్‌కాలనీ: గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులో అనారోగ్యంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి కదలలేని పరిస్థితిలో ఉన్నాడని స్థానికులు కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడిని గుర్తుపడితే కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.


దుకాణాల్లోకి తాగునీరు
వ్యాపారాలు ఖరాబు

- ఎంసీహెచ్ఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీ
- కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో చేరుతున్న నీరు
- వ్యాపారులకు తప్పని తిప్పలు
- తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోని అధికారులు



నిత్యం ఎంసీహెచ్ఎస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో లీకై ప్రవహిస్తున్న తాగునీరు





మోతీనగర్: మూడు దశాబ్దాలుగా స్వచ్ఛమైన తాగునీరు మట్టిపాలవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. మూసాపేట డివిజన్ మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ షాపింగ్ కాంప్లెక్ ప్రధాన రోడ్డు ముందు భాగాన ఉన్న సెల్లార్‌లో గత మూడు దశాబ్దాలుగా ఎర్రగడ్డ ప్రాంతం నుంచి అండర్ గ్రౌండ్ నుంచి తాగునీరు నిరంతరం సరఫరా అవుతోంది. కానీ లీకేజీతో విలువైన తాగునీరు మట్టి పాలవుతోంది. దీంతో సెల్లార్‌లో ఉన్న దుకాణాల్లో నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా కొనుగోలుదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ పలుమార్లు సంబంధిత అధికారులకు, ఎంసీహెచ్ఎస్ పాలక కమిటీ సభ్యులకు విన్నవించినా ఫలితం లేదు. దశాబ్దాల కాలం పాటు నిరంతరం క్రమం తప్పకుండా వ్యాపారాలు కొనసాగుకున్నా ప్రతి నెలా అద్దె మాత్రం చెల్లిస్తున్నామని తెలుపుతున్నారు. అకాల వర్షాలు కురిసినప్పుడు, వర్షాలు కురిసినప్పుడు చిన్నపాటి వాగులా తయారవుతోంది. ఆ నీటిని ఆయా షాపుల యజమానులు తొలగించికున్నప్పుడు కొద్ది మేర తగ్గినట్లు కనిపించినా తిరిగి యథాస్థితికి వస్తున్నాయి.

◆ ఈ సమస్యను పరిష్కరించాలంటే ఎర్రగడ్డ కళ్యాణ్‌నగర్ వెంచర్ 3లో ఉన్న తాగునీటి సరఫరా అయ్యే నీరు మోతీనగర్ ప్రధాన రోడ్డు నుంచి సరఫరా అవటంతో ఆ పైపు లైన్ మార్చి కొత్త పైపులైను వేయాలని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎంసీహెచ్ఎస్ పాలక కమిటీ సభ్యులు వృథాగా పోతున్న తాగునీటి పైపులైన్ స్థానంలో నాణ్యత కలిగిన పైపులైన్ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విన్నవించినా ఫలితం లేదు..



మూడు దశాబ్దాలుగా ఎంసీహెచ్ఎస్ కాంప్లెక్స్ ఆవరణలో అంతర్గతంగా ఉన్న తాగునీటి పైపులైన్ లీకేజీ కారణంగా మా వ్యాపారాలు కొనసాగటం లేదు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ఎంసీహెచ్ఎస్ ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు.

– వేణుగోపాల్, బుక్‌స్టాల్ యజమాని

శాయశక్తులా కృషి చేస్తాం..



తాగునీటి లీకేజీ సమస్యను పరిష్కరించటానికి మేము కృషి చేస్తున్నాం. ప్రధాన సమస్య కావటంలో త్వరలో జలమండలి అధికారులను కలిసి వివరిస్తాం. శాశ్వతంగా సమస్యను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తాం.

– నలమాల్పు అంజిరెడ్డి, ఎంసీహెచ్ఎస్ అధ్యక్షుడు

బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భిక్షపతియాదవ్, రవికుమార్‌యాదవ్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి నాలుగు డివిజన్లకు సంబంధించి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యాలయాన్ని రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.

◆ ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుల కోసం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం నూతన కార్యాలయం ఏర్పాటు చేశామన్నారు.

◆ భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు జరిగిన అభివృద్ధే కానీ ఇప్పుడున్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.

◆ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దాచుకోవడం, దోచుకోవడం తప్ప కేసీఆర్ చేసింది ఏమీ లేదన్నారు. ఇతర ప్రాంతం వాళ్ల తప్పు చేస్తే ఇక్కడి నుంచి వెళ్లగొట్టమన్న కేసీఆర్‌కు లక్షల కోట్లు మింగిన అతడిని ఈ ప్రాంతం వారే బొంద పెట్టాలని పిలుపునిచ్చారు.

◆ ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నర్సింగరావు, కమలాకర్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, రవీంద్రరావు, నర్సింగ్ యాదవ్, చారి, సీతారామరాజు, నాగులు గౌడ్, రామరాజు, కుమార్ యాదవ్, దేవి రెడ్డి, జ్యోతి, శ్రీలత, నవత రెడ్డి పాల్గొన్నారు.

అప్పు తిరిగి ఇవ్వనందుకే ఆటో డ్రైవర్ హత్య

ముగ్గురు నిందితుల అరెస్టు



కేపీహెచ్‌బీకాలనీ: అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతోనే ఆటో డ్రైవర్‌ను సొంత బావమరిది మరో ఇద్దరు స్నేహితులతో కలిసి దారుణంగా హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శుక్రవారం కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. సంగారెడ్డికి చెందిన అబ్దుల్ అన్వర్ (27) బావమరిది సయ్యద్ అహ్మద్ బావమరిది స్నేహితుడైన మహమ్మద్ అఖీల్ వద్ద ఆటో అద్దెకు తీసుకొని నడుపుతున్నాడు. అంతేకాకుండా రూ.1.45 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అవి తిరిగి ఇవ్వకపోవడంతో గత నెల 30న అన్వర్ భార్య, అత్త, బావమరిది సయ్యద్ అహ్మద్‌లు కొహిర్‌కు వెళ్లి డబ్బుల విషయం తేల్చాలని 31న అన్వర్‌ను తీసుకొని హైదరాబాద్ వచ్చారు.

◆ మద్యం తాగేందుకని అన్వర్, అఖీల్, అతని స్నేహితుడు ఇమ్రాన్‌లతో కలిసి హాఫీజ్‌పేటలోని మద్యంషాపు వద్ద మద్యం తీసుకొని తాగుతూ ఆటోలో మాదాపూర్ మీదుగా జూబ్లీహిల్ బోరబండ వెళ్లారు. అక్కడ మరో స్నేహితుడు అమీర్‌ని తీసుకొని హాఫీజ్‌పేటకు బయలుదేరారు. హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ సమీపంలోని ముళ్లకత్వ చెరువు వద్దకు రాగానే చీకటి ప్రాంతంలో ఆటో నిలిపారు. ఆటోలో ఉన్న అన్వర్‌ను తీసుకొని అహమ్మద్, అఖీల్, ఇమ్రాన్‌లు బీరు బాటిల్, బండరాళ్లతో అన్వర్ తలపై మోది గొంతు కోసి గొంతు కోసి హత్య చేశారు. మరో స్నేహితుడు అమీర్ వారిని నిలువరించేందుకు ప్రయత్నించాడు. అతడిని అఖీల్ బెదిరించి ఇందులో తల దూర్చవద్దని అక్కడి నుంచి పంపించారు. అన్వర్‌ను దారుణంగా హత్య చేసిన విషయం అమీర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. ముగ్గురు నిందితులు అదుపులోకి తీసుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

‘మీ సమస్య– మా పోరాటం’ ద్వారా
సమస్యలను పరిష్కరిస్తాం



మురుగు సమస్యపై స్థానికులతో మాట్లాడుతున్న నాయకుడు యోగానంద్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయి కాలనీ వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించి,ఆల్విన్‌కాలనీ ఫస్ట్ ఫేజ్, ఈస్ట్ సాయికాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి గజ్జెల యోగానంద్ శుక్రవారం పర్యటించారు. తులసినగర్‌లోని కనకదుర్గ ఆలయం వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక రోడ్డుపై మురుగునీరు పారుతోందన్నారు. గుడికి వచ్చే భక్తులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నా కనీసం ప్లే గ్రౌండ్ , పార్కు, కమ్యూనిటీ హాలు నిర్మించకుండా అధికార పార్టీ నాయకులు ఈ స్థలాలను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన రాజీవ్ గృహకల్ప ఇళ్లను అధికార పార్టీకి చెందిన వారు దౌర్జన్యంగా లాక్కుని, తిరిగి వాటిని అద్దెకు వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై ‘మీ సమస్య- మా పోరాటం’ద్వారా వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజిత్ వర్మ, సురభి రవీందర్, స్రవంతి, రామరాజు, రఘు, రామకృష్ణ, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

బాలానగర్: బాలానగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ రషీద్, వర్కు ఇన్‌స్పెక్టర్ రాములతో కలిసి డివిజన్ పరిధిలోని డీఎస్‌కాలనీలో పర్యటించారు. మంజూరైన డ్రైనేజీ, సీసీ రోడ్డుకు సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు అమోర్ ఆసుపత్రి ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రాంతంలో మరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రాబోతోంది. వై జంక్షన్ ప్రాంతంలో సకల సౌకర్యాలతో ఏర్పాటు చేసిన అమోర్ ఆస్పత్రిని శనివారం ఉదయం 10గంటలకు ఘనంగా ప్రారంభిస్తునట్లు ఆసుపత్రి ఎండీ డాక్టర్ కిషోర్ బి.రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య ప్రాంతాలో అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ పగుడాల శిరీష పాల్గొననున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓపెన్ హౌస్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ఆసుపత్రిలో 30కి పైగా స్పెషాలిటీలు, 250కి పైగా పడకలతో మల్టీ సూపర్ స్పెషాలిటీ, టెర్షియరీ కేర్ సదుపాయం ఉన్న ఈ ఆసుపత్రి, ఇక్కడ చేరే రోగులకు స్నేహపూర్వక వాతావరణంలో నాణ్యమైన వైద్య చికిత్స అందిస్తామన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

మోతీనగర్: అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు రాజీ పడకుండా తప్పని సరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ పేర్కొన్నారు. శుక్రవారం అవంతినగర్‌లో నిర్మిస్తున్న నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నిర్మాణ పనులు చేపట్టేటప్పుడు స్థానికులు దగ్గరుండి నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చూడాలన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో వర్కు ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, ఎర్రస్వామి, రమేష్ నాయర్, శోభా రాజన్, నర్సింహ, అనిల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల పనులు త్వరగా పూర్తి చేయాలి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఆకస్మికంగా పార్కుల పనులను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ డివిజన్ ఇటీవల అభివృద్ధి కోసం శంకుస్థాపన చేసిన పార్కుల పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధనలక్ష్మీ సెంటర్ పార్కు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. భువన విజయం గ్రౌండ్‌లోని ఇండోర్ షటిల్ కోర్టు వద్ద క్రీడల్లో పాల్గొన్న ప్రజలను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రమ్యా గ్రౌండ్ వద్ద జరుగుతున్న మూడు పార్కులను పరిశీలించి మౌలిక వసతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మంచినీరు, టాయిలెట్స్, ప్రహరీల ఎత్తు పెంచాలని ఆదేశించారు. అనంతరం 9వ ఫేజులోని ఇండోర్ షటిల్ కోర్టు వద్ద తనిఖీ చేసి మలేసియన్ టౌన్‌షిప్ వద్ద డిమార్టు వెనుక ఉన్న పార్కు పనులను, క్రికెట్ మైదానం కొరకు జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు.

◆ అక్కడ యువతకు క్రికెట్ ఆడుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని సుందరంగా తీర్చి దిద్దాలని సూచించారు. ఎక్కడా కూడా పార్కుల్లో మౌలిక వసతులకు ఇబ్బంది లేకండా చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో ఇబ్బంది లేకుండా విద్యుత్ లైట్లు, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పార్కుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేసి స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డిఇ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీ డివిజన్‌లో పార్కును పరిశీలిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలాజీనగర్ డివిజన్‌లో...

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో కలిసి బాలాజీనగర్‌లోని రెయిన్‌బో విస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్ పనులను శుక్రవారం పరిశీలించారు. అక్కడ ఉన్న నాలుగున్నర ఎకరాల స్థలంలో స్టేడియం నిర్మాణం కోసం స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఎక్కడికక్కడ పార్కులు, ఓపెన్ జిమ్‌లు, ఇండోర్ స్టేడియాలు, షటిల్ కోర్టులు, క్రికెట్ క్రీడా మైదానాలు నిర్మిస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రజలు ఉపయోగించుకొని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. యువత క్రీడల్లో దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇప్పటికే కూకట్‌పల్లి నియోజవర్గం నుంచి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని విభాగాల్లో అత్యున్నత స్థాయిలో నిలిచారని అందుకు గర్వకారణంగా ఉందన్నారు.